జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు



ఆనందపురంలోని జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు

- ఉచితంగా మీటర్లు, వీధిలైట్ల ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ముకుందపురంలోని జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు

ఆనందపురం : గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలు విషయంలో అలసత్వం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించేది. దీంతో లబ్ధిదారులకు కష్టాలు తప్పేవి కావు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం పథకాలు ప్రారంభించడమే కాకుండా వాటి ద్వారా లబ్ధిదారులు పూర్తి స్థాయి సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకుంటోంది. మండలంలో పెద్ద ఎత్తున చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకుంటుండగా, అంతేవేగంగా మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 26 పంచాయతీల్లో జగనన్న కాలనీల నిమిత్తం 58 లే అవుట్లు వేశారు. వాటి ద్వారా 2,474 మంది పేదలు పట్టాలు పొంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు ఒక వైపు జరుగుతుండగానే... మరోవైపు కాలనీల్లో విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆనందపురం మండలంలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. దీంతో అన్నిచోట్లా పనులు దాదాపు పూర్తయ్యాయి. మరోవైపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి విద్యుత్ మీటర్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రాత్రివేళ ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండడానికి ఎన్నడూ లేనివిధంగా స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల కాలనీలు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. గృహ ప్రవేశాలకు ముందే అన్ని సౌకర్యాలు సమకూరడంతో లబ్ధిదారులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



వెల్లంకిలో ఆకట్టుకుంటున్న జగనన్న కాలనీ ఇల్లు

వీధిలైట్ల ఏర్పాటుతో ఎంతో సౌకర్యం



జగనన్న కాలనీలో సౌకర్యాలు ఇంత త్వరగా ఏర్పాటు చేస్తారనుకోలేదు. మాకు కొండ ప్రాంతంలో ఇంటి స్థలం ఇచ్చారు. అక్కడ రాత్రివేళ నిర్మానుష్యంగా ఉండేది. ఇల్లు నిర్మించుకుంటే రాత్రివేళ చీకట్లో ఉండాల్సి వస్తుందని భయపడ్డాము. కానీ ఇళ్ల నిర్మాణంతోనే విద్యుత్ లైన్లు, వీధిలైట్లు వేశారు. దీంతో ఎంతో సౌకర్యవంతంగా ఉంది.

– యర్ర వెంకటలక్ష్మి, జగనన్న కాలనీ లబ్ధిదారు, కణమాం

విద్యుత్ సౌకర్యంతో నిర్మాణాలు వేగవంతం



కాలనీ లే అవుట్‌ల వద్ద ముందస్తుగానే విద్యుత్ సౌకర్యం కల్పించడంతో నిర్మాణ పనులకు ఎంతగానో ఉపయోగపడింది. ముఖ్యంగా నీటి సమస్య అధికంగా ఉండేది. అయితే విద్యుత్ లైన్లు వేసి మోటారు ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణాలకు అవసరమైన నీటిని సరఫరా చేశారు. దీనివల్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోగలిగాం.

– రావర్తి హేమ, జగనన్న కాలనీ లబ్ధిదారు, గొల్లల కణమాం

క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీల వితరణ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెం ప్రాథమిక పాఠశాలకు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి 5 కుర్చీలు అందజేశారు. ఉపాధ్యాయులకు కుర్చీలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, అందుకే అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎరుసు అప్పలకొండ రెడ్డి, పాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలుకు వేలంపాటలు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో రెండు, మూడు వార్డులకు చెందిన తగరపువలస, భీమిలి రోడ్డు మార్జిన్‌లలో ఆశీలు వసూలుకు సంబంధించి వేలంపాటలు జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తగరపువలస రోడ్డు మార్జిన్‌లో ఆశీలు వసూలుకు బమ్మిడి శ్రీను రూ.10.53 లక్షలకు వేలంపాట పాడుకోగా అతనికి ఖరారు చేశారు. అలాగే భీమిలికి సంబంధించి మాదాసు రాంబాబు రూ.5.67 లక్షలకు పాడుకోగా ఖరారు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ సంవత్సరంపాటు ఆయా ప్రాంతాల్లో వీరు ఆశీలు వసూలు చేసుకోవచ్చని తెలిపారు. ఖారారైన మొత్తానికి అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నాటకాలకు ప్రజాదరణ

తగరపువలస: కాలం, సంస్కృతి, ప్రాంతాన్ని బట్టి నాటకం మారినప్పటికీ అంతర్లీనంగా దాని మూలం మాత్రం ఒక్కటేనని, అందువల్ల రంగస్థల ప్రక్రియలో నాటకం బహుళ ప్రజాదరణ పొందిందని బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుని విశ్వజనీయమైందన్నారు. దానికి గుర్తుగా ఏటా ఈ తేదీన కళాకారులు ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, శస్త్ర చికిత్సలు తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో మాట్లాడారు. సాధారణ ప్రసవాల మీద మహిళల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా మేరకు వారు ఐరన్ పోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. శశిభూషణం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సింహాచలం: చినముషిడివాడలోని చాణిక్యనగర్ రామాలయంలో ఆదివారం రాత్రి స్థానిక నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సీనియర్ విద్యార్థినులు సాయిపూజిత, నవ్యలతో కలిసి చిన్నారులు అద్భుతంగా అభినయం చేశారు. నృత్యనికేతన్ నిర్వాహకురాలు డాక్టర్ విజయజ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సివిల్ ఇంజినీరింగ్ నిపుణులకు డిమాండ్



ప్రసంగిస్తున్న డైరెక్టర్ సతీష్ కుమార్ ఆర్య

కొమ్మాది: సివిల్ ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులపై అవగాహన కల్పించడంతో పాటు నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణ్ ఉత్సవ్ పేరిట యువజనోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ ఆర్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో సివిల్ ఇంజినీరింగ్ నిపుణులకు డిమాండ్ ఏర్పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనిట్స్ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల ప్రతినిధులు

తగరపువలస: డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ – విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు తిరుపతి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాలల పురుషుల క్రికెట్ పోటీల్లో సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను సీఈవో నిరంజన్‌కుమార్, ప్రిన్సిపాల్ రాధా మాదవ్ త్రిపాఠి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, ఏవో శివప్రసాద్, హెచ్‌ఆర్ శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్లు గున్నాజీ, వేణుగోపాల్ అభినందించారు.

శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు



తాటితూరులో రాట వేస్తున్న అర్చకుడు, భక్తులు



కృష్ణాపురం రామాలయం వద్ద రాట వేస్తున్న భక్తులు

తగరపువలస: శ్రీరామ నవమి సందర్భంగా గురువారం భీమిలి పరిధిలోని పలు ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించడానికి ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలను కొబ్బరి పందిళ్లు, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. నవమి రోజున భక్తులకు అన్నదానం, పానకం, వడపప్పు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. భీమిలి మండలంలోని చిప్పాడ, తాటితూరు, తగరపువలస, వలందపేట, నమ్మివానిపేట, సంతపేట, చిట్టివలస, తాళ్లవలస, మజ్జివలస తదితర ఆలయాల్లో కల్యాణం నిర్వహించనున్నారు.

ఘనంగా పెళ్లి రాట ఉత్సవం

పద్మనాభం: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని కృష్ణాపురం రామాలయం వద్ద సోమవారం పెళ్లి రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం పెళ్లిరాట వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురాల అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, సురాల అచ్చింనాయుడు, గాడు అప్పలరాజు పాల్గొన్నారు.

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ కోదండ రామాలయంలో శ్రీ రామనవమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ రాట వేశారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా హాజరయ్యారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సీతారాముల కల్యాణం జరపనున్నామని తెలిపారు. 27 టివిఎల్ 04 : తాటితూరు రామాలయం వద్ద ఉత్సవ రాట వేస్తున్న అర్చకుడు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : మంచి పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని లొడగలవానిపాలెం సర్పంచ్ లొడగల రాజేశ్వరి చెప్పారు. లొడగలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరన్ ఎక్కువగా లభ్యమయ్యే రాగిపిండి, బీన్స్‌పిండి, ఆకుకూరలు, బెల్లం, జామ, నిమ్మ, కూరగాయలు వంటివి తీసుకోవాలని సూచించారు. ఇవి స్థానికంగానే చవకగా లభ్యమవుతాయని చెప్పారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వీవీ రత్నం మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణపై తల్లులకు అవగాహన కలిగించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లొడగల రమణ, కార్యదర్శి అనురాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ అవస్థలు

మధురవాడ: మధురవాడ జోన్ – 2లో ఆధార్ సీడింగ్ అవ్వకపోవడంతో 2 నెలల నుంచి దరఖాస్తులు పేరుకుపోయాయి. తన తల్లి వరలక్ష్మి ఆధార్ నంబర్‌కి వేరే ఇద్దరు వ్యక్తుల ఆస్తులు యాడ్ అయిపోయాయని, ఈ విషయమై మూడేళ్లుగా సిబ్బంది తిప్పుతున్నారంటూ శివశక్తినగర్‌కి చెందిన శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం జెడ్సీ కనకమహాలక్ష్మిని కలిసి తన సమస్య వివరించారు. సీడింగ్ కాకపోవడంతో తన తల్లికి పింఛన్‌తోపాటు ఇతర ప్రభుత్వ పథకాలు ఆగిపోయాయని వాపోయారు. జోనల్ ఆఫీసులో, సచివాలయంలో సిబ్బందిని అడిగితే పొంతన లేని, నిర్లక్ష్య సమాధానాలు చెపతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జోన్‌లో 74 దరఖాస్తుల పెండింగ్

మధురవాడ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన బి.రాము భీమిలికి బదిలీకాగా ఆయన స్థానంలో అనకాపల్లి నుంచి బదిలీపై కనక మహాలక్ష్మి వచ్చి 2 నెలలు కావస్తున్నా ఎడిట్ ఆప్షన్ కొత్త జెడ్సీకి బదిలీ కాలేదు. దీంతో జోన్‌కి చెందిన 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో ఆధార్ సీడింగ్ దరఖాస్తులు 74 పెండింగ్‌లో ఉండిపోయాయి. జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాలు వల్ల చాలా మంది ఆధార్ నంబర్‌కి సంబంధం లేని ఆస్తులు యాడ్ అయిపోయాయి. దీనివల్ల వారు ప్రభుత్వ పథకాలకు దూరం అయిపోతున్నారు. దీనిపై జెడ్సీ కనక మహాలక్ష్మి వివరణ కోరగా ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు.

విద్యార్థిని అదృశ్యం

పీఎం పాలెం: ఆంధ్రా యూనివర్శిటీలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నగరంపాలెంకు చెందిన ఎం.రీతిక (21) ఏయూలో హ్యూమన్ జెనిటిక్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎప్పటిలాగే ఈ నెల 17న ఉదయం కాలేజీకి వెళ్లిన రీతిక తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా ఆ యువతి ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి రామకృష్ణ పీఎం పాలెం పోలీసులను ఆశ్రయించాడు. హెచ్‌సీ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

‘నిర్లక్ష్యపు పొగ’పై జెడ్సీ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..



గడ్డి కుప్పను తరలిస్తున్న శానిటరీ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ఓ రెస్టారెంట్ ఎదురుగా ఫుట్‌పాత్, రోడ్డుపై గడ్డి కుప్పను తగలబెట్టడంపై ‘సాక్షి’లో సోమవారం ప్రచురించిన ‘నిర్లక్ష్యపు పొగ’ వార్తపై జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్పందించారు. బీచ్ రోడ్డు ప్రధాన రహదారి వద్ద ఇంత జరుగుతున్నా శానిటరీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జి – 20 సదస్సు నేపథ్యంలో తీర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతున్న తరుణంలో ఇలాంటి చర్యలు గమనించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు రెస్టారెంట్ నిర్వాహకులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు రూ.10 వేల జరిమానా విధించారు. అదేవిధంగా అక్కడ ఉన్న గడ్డి కుప్పలను సిబ్బందితో తొలగించారు.

ప్రమాదకరంగా జ్యూట్‌మిల్లు గోడ



పెద్ద బంగళా వద్ద కూల్చకుండా వదిలేసిన ఎత్తయిన గోడ

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు శివారులోని పెద్ద బంగళా వద్ద ఎత్తైన గోడ ప్రమాదకరంగా పొంచి ఉంది. శ్రీరామ్‌నగర్ – మూలకుద్దు రహదారిని ఆనుకుని సుమారు 20 అడుగుల ఎత్తున రోడ్డువైపు వాలి ఉంది. జ్యూట్‌మిల్లు మూత కారణంగా వందేళ్ల క్రితం నిర్మించిన కట్టడాలన్నీ ఇటీవల కూల్చివేసి ప్రహరీ నిర్మించారు. బయట వైపు 50 మీటర్ల పొడవైన గోడ, లోపలి ప్రాంతంలో అక్కడక్కడ గోడలు మాత్రం వదిలేశారు. లోపలి గోడల వల్ల ప్రమాదం లేకపోయినా నిత్యం ఈ బయటి గోడను ఆనుకుని రహదారి మీదుగా వేలాది మంది గుడివాడ, మూలకుద్దు పంచాయతీవాసులతోపాటు పశువుల కాపరులు, మత్స్యకారులు రాకపోకలు సాగిస్తుంటారు. మొండిగోడ మాత్రమే మిగిలి వుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎవరి మీదయినా కూలుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరగకముందే గోడను మిల్లు యాజమాన్యం కూల్చివేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు సూచించారు. పద్మనాభంలో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదనపు, డెలివరీ చార్జీలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరకు గడప వద్దకు సిలిండర్లు వేగవంతంగా డెలివరీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ కోరాడ మంజు, నాయకులు మొకర అప్పలనాయుడు, మామిడి శివరామకృష్ణ, సిరుగుడి ఆదినారాయణ, జి.వి.కె.కె.వర్మ, బోని సన్యాసినాయుడు, సుంకర బంగారప్పడు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, కోన శ్రీను, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల పల్లకీ సేవ



వుడా కాలనీ రోడ్డులో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న పోతిన శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: కార్‌షెడ్ కూడలిలో కొలువైన శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో గల లక్ష్మీవానిపాలెం, పాత పీఎంపాలెం, కారుషెడ్ కూడలి పరిసర ప్రాంతాల్లో ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలు, బాణసంచాలతో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, లక్ష్మి పరమేశ్వరి, ఆలయ కమిటీ, నిర్వాహక కమిటీ సభ్యులు పోతిన సూర్యారావు, వెంకట సత్యనారాయణ, బాలాజీ, పోతిన నాయుడు, పోతిన గిరిబాబు, పోతిన తిరుమలరావు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేలకు చెట్ల ఫలసాయం లీజు



వేలంపాటను పర్యవేక్షిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేలంలో చెట్ల ఫలసాయానికి మధురవాడకు చెందిన కుడితి అప్పారావు రూ.60 వేలకు పాట దక్కించుకున్నారు. ఇతర ఆస్తుల లీజుకు పాటపాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. మధురవాడలోని జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనక మహాలక్ష్మి పర్యవేక్షణలో సూపరింటెండెంట్ అప్పలరాజు వేలం నిర్వహించారు. ఇక్కడి డైలీ మార్కెట్, వారపు సంత, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, పార్కింగ్, క్యాంటీన్, ఐస్ క్రీమ్ బల్ల నిర్వహణకు పాట నిర్వహించారు. అయితే ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మంగళవారానికి వేలం వాయిదా వేశారు.

మందులతో క్షయ నియంత్రణ



చిప్పాడ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: క్షయ వ్యాధిని మందులతో నియంత్రించవచ్చని భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆరోగ్య సిబ్బంది ఎన్వీ రమణ, చక్రవర్తి, శ్రీను తదితరులు తెలిపారు. భీమిలి మండలం చిప్పాడలో క్షయ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటువ్యాధిగా ప్రబలే క్షయను పౌష్టికాహారంతో నివారించవచ్చన్నారు. గాలి ద్వారా వ్యాపించే ప్రమాదం ఉన్నందున బాధితులు చేతి రుమాలు లేదా మాస్క్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, ఆశాకార్యకర్తలు జి.సన్యాసమ్మ, ఆర్.దేవి తదితరులు పాల్గొన్నారు.

774వ రోజుకు ‘ఉక్కు’ రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ కార్మికుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిరసనలు చేపట్టి సోమవారానికి 774వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లైతే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ప్లాట్లు ఇవ్వాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని నరసాపురం గ్రామంలో ల్యాండ్ పూలింగ్ కోసం తమ నుంచి తీసుకున్న ప్రభుత్వ భూములకు జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, అతని బినామీలకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి తమకివ్వాలని కోరుతూ రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నరసాపురంలో తమ ఆధీనంలో ఉన్న రెండు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తీసుకున్నారని రైతులు తెలిపారు. ఇందులో సుమారు 60 నుంచి 70 ఎకరాల భూమిని గిరిబాబుకు, అతని కుటుంబ సభ్యులు, బినామీల పేరున నమోదు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత తహసీల్దార్ లోకేష్, ఉప తహసీల్దార్ కిశోర్‌తో గిరిబాబు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడి భూమిని రాయించుకున్నారని ఆరోపించారు. ఆందోళనలో గంధవరం, కొవ్వాడ, విజయగనగరం జిల్లా నారాయయణపురం గ్రామాల రైతులు, కొవ్వాడ మాజీ సర్పంచ్ మాదిరెడ్డి భాస్కరావు పాల్గొన్నారు.